
# బుడుగు! చిచ్చుల పిడుగు!



అసలు ప్రవేటూ చెప్పడం అంటే తిట్టడం అని అర్థం. కొట్టడంఅని కూడా అర్థం.

ఈ ప్రపంచకంలో ప్రవేట్లు ఎన్నో రకాలు. ఎన్ని రకాలో నే చెప్పలేను. ప్ఫదిరకాలుంటాయేమో. ప్రవేటు మేష్టర్లుకూడా ఎన్నో రకాలున్నాయి.

మొగమేష్టర్లూ, ఆడమేష్టర్లూ, కళ్లజోడువీ, నల్లకోటువీ ... ఇంకా గుండుమేష్టర్లు, పిలకమేష్టర్లూ (పూర్వకాలంలో నాకు ఈ రెండూ ఉండేవి. మేష్టర్లుకాదు. గుండూ పిలకాను)

కొంతమంది చూట్టానికి అచ్చంగా ప్రవేటు మేష్టర్లులా ఉంటారు కాని నిజంగా కాదు.

కొంతమంది చూట్టానికి ప్రవేటు మేష్టర్లా ఉండరు. కాని నిజంగా అవును

ఇంకొంచెంమంది చూట్టానికీ, నిజంగానూ ప్రవేటుమేష్టర్లే అలాగే, కొన్ని మేష్టర్లు కొంచెం పారం చెప్తారు కొందరు ఉత్తినే తిట్తారు.

మా యింట్లో బామ్మ, నాన్న, బాబాయి వీళ్లు ఇంకోరకం ప్రవేటు మేష్టర్లు అన్నమాట.

పొద్దున్నే అమ్మేమో బామ్మకి వంటకి కావలసినవి అన్నీ చక్కన యియ్యాలి. యియ్యకపోతే బామ్మ యిలా కోపంగా మొహంపెట్టి అమ్మకి ప్రవేటు చెప్తుంది.


అమ్మ నన్ను ఎప్పుడేనా కొడితే, నాన్న అప్పుడు అమ్మకి ప్రవేటు చెపాడు. నేను దెబ్బలాట అనుకున్నాను కాని, ప్రవేటు అని బాబాయి చెప్పాడు.


మధ్యాన్నం అప్పుడు, బామ్మ ఒక్కోసారి అమ్మ బుగ్గమీద వేలితో పొడిచి నీయిల్లు బంగారంగానూ అని కోప్పడుతుందా; అమ్మమాత్రం యేడవదు. ఓలా నవ్వుతుంది. (అమ్మ అలా నవ్వితే భలే బావుంటుంది. నేనుకూడా అలా నవ్వగలను.) ఒక్కోసారి నాన్న ప్రవేటు చెప్పినప్పుడుకూడా అమ్మ గట్టిగా నవ్వుతుంది.

ఓసారి నాన్న, అమ్మ చెవి పట్టుకుని కీ ఇస్తున్నాడు.

అంతట్లోకి నాకు ఆకలేసింది. అమ్మా ప్రేవేటు అయిందా, ఆకలేస్తోంది అన్నం పెట్టుదు గాని అన్నాను

అమ్మకి కోపం వచ్చింది కాబోలు కాని అప్పటికింకా నవ్వు అయిపోలేదు. అందుకని రెండుతోటీ, "ఫీ ఫోకిరీ వెధవకానా"





అంది కోపంగానూ, నవ్వుతూనూ.

నాకు తరవాత బాబాయి చెప్పాడు ప్రైవేటు చెప్తుంటే అలా అన్నం పెట్టమని కూడదూ అని ఇగో ఈ ప్రైవేట్లేం, ఎప్పుడూ ఏమిటి సరిగ్గా చెప్పక గిన్నె లోపం అంటారు ఇలా అని మనం అంటే మళ్ళీ కోపం.

ఇంతెందుకు, ఆవేళ సాయంత్రం మా బాబాయి నన్ను సావిట్లో కూర్చోపెట్టి ప్రైవేటు చెప్తున్నాడు లెక్కలో ఏవో అంతలోకే ఓ నిజం ప్రైవేటు మేష్టరు లాంటాయన వచ్చాడు

వచ్చి, నన్నుచూసి ప్రైవేటు చెప్పుకుంటున్నావా బాబూ అన్నాడు

నాకు ఒళ్లు మండిపోయింది పొద్దున్నేగదా, ప్రైవేటు చెప్తున్నప్పుడు ఎవరూవచ్చి మాట్లాడకూడదన్నాడు బాబాయి పొద్దున్న అందుకనే అమ్మ నన్ను తిట్టిందికూడా. ఈ ప్రైవేటు మేష్టరులాంటి ఆయన చిన్నవాడా చితకవాడా అందుకని నాకు ఒళ్లుమండిపోయింది

“ఛీ పోకిరి వెధవ కానా” అన్నాను.

అంతే. ఇంకేం అనలేదుగదా కాని బాబాయి మొట్టికాయ వేసేశాడు అంతలోకే బామ్మవచ్చి ఆరి పిసుగా అంద అమ్మవచ్చి దిబ్బకాయి వెధవా అంత ఆ ప్రైవేటు మేష్టరులాంటి ఆయనకూడా ఆరి భడవా అనేశాడు.

ఇంతవరకూ నా తప్పు ఏమిటో వాళ్లు చెప్పలేదు గురువు దేముడు అని మాత్రం చెప్పారు. హన్నా అన్నాగు. అప్పుడు వచ్చినవాడే నాకు కొత్త ప్రైవేటు మేష్టరుట.

ఎవడికి తెలుసు ముందస్తుగా చెప్పకపోతే? మహామహా మా బామ్మకే తెలీదు.

అందుకని ప్రైవేటు మేష్టర్లు కొత్తగా వచ్చినప్పుడు ముందస్తుగా వాళ్లేనా చెప్పాలి. లేపోతే అమ్మ నాన్నయేనా చెప్పాలి.

లేకపోతే, ఇలాగే అవుతుంది. ఇలాగే అయితే, పిల్లలుపూరుకోరు. నేను మంచివాణ్ణి కాబట్టి (అప్పుడు అందరూ నన్ను పెంకివెధవాయి అన్నా) పోనే గదా అని, ఆ మేష్టరుచేత మూడ్రోజులదాకా ప్రైవేటు చెప్పించాను. అదే యింకోడైతేనా ఒకరోజుకూడా ఛాన్సు ఇవ్వడు.

నాదగ్గిర పదిమేష్టరు పనిచేశారనుకో; వాళ్లందరూ నిజంగా మంచివాళ్లే నేనంటే ఇష్టం. కానిపాపం రెండ్రోజుల్లో, పదిహేను రోజుల్లో అయ్యాకా వాళ్లేమానేసేవాళ్లు. నన్ను భరించలేను అని చెప్పారుట నాన్నతో. (భరించడం అంటే మొయ్యడం అని బాబాయి చెప్పాడు) ఉత్త అబద్ధం నేను వాళ్ళ వీపుమీద సవారీ చేస్తానని ఎప్పుడూ అనలేదు కూడా. అయినా వాళ్లలా అనడం అన్యాయంకాదూ? అని అడుగుతున్నాను.

అయితే అన్యాయం అని తెలీసువాళ్ళకి. అపార్థం తెచ్చుకున్నారన్నమాట. అంటే కోపం తెచ్చుకోవటం ఇలాఅయితే పిల్లలు ఎంత అపార్థం తెచ్చుకోవాలి?

ఒకమాట చెప్తాను. నేనున్నాననుకో. నాకు ప్రవేటు చెప్పిన ఒక్కొక్క మేష్టరు ఒక్కొక్క లాంటివాడు ఒక మేష్టారేమో నా చెవికి, కి ఇచ్చినప్పుడేమో యిలా ఎడం వేపుకి తిప్పుతారు.

పోనే అని ఊరుకుంటూంటూ ఇంకో కొన్నాళ్ళకి కొత్తవాడొస్తాడు కొత్తగ వాడేమో ఆ చెవినే కుడివేపుకు మెలిపెడతాడు. మళ్లా ఇంకో మేష్టరు ఎడం వేపుక తిప్పుతాడు ఇలాఅయితే చెవిపాడైపోదూ

అంతేకాని అయ్యో పుత్రరత్నం, ఏడి చెవిని ఇదివరకటి మేష్టరు ఏటు మెలి వేశాడని అడుగుతాడా అని మాస్తాను ఎప్పుడూ అడగడు.

మా నాన్న, అమ్మ పోనీ ముందస్తుగా చెప్తారా చెప్పరు
నేనెందుకు చెప్పాలి చెప్పను.
యిప్పుడు చెప్తాననుకో

# నా సలహాలు

యేమిటంటే, ముందు మేష్టర్లకి సలహాలుఇస్తాను యెందుకంటే, మేష్టరంటే గురువు గురువంటే దేముడుట. అందుకు.

ఒకటి ప్రవేటు మేష్టరు కొత్తగా ఒక పుత్రరత్నానికి వచ్చేటప్పుడు ముందస్తుగా పాత మేష్టరుఇంటికెళ్ళాలి వెళ్లి ఇగో పాత మేష్టరూ నువ్వు అల్లవారి పిల్లడు ఫలానా బుడుగుకి చెవి ఎలా మెలిపెట్టేవాడివి? ఎడం వేపుకా, కుడికా? అని అడిగిరావాలి లేకపోతే, ఫలానా నన్నే అడిగెయ్యాలి అప్పుడు నేనే చెప్తాను

ఇంకోటి. కొత్త మేష్టరు కొంచెం రోజులేనా తలపాగా చుట్టుకురావాలి ఎందుకంటే, కొన్నిసారు పెంకిపిల్లలుంటారు పెంకిపిల్లలేమిటిలే ఓసారి నేనే అలాచేశాను ఒక మేష్టర్ని.

మూడు: చాక్లేట్లు తెస్తే యేంలాభం లేదు వేసిపకోడీలు తెస్తే పిల్లలు మీమాట వింటారు.

“కొత్తగా వచ్చే మేష్టర్లు కొన్నాళ్లు తలపాగా చుట్టుకోవాలి.”

# ★ బుడుగు! చిచ్చుల పిడుగు! ★




(నన్నడిగితే, ఓ కబురు చెప్తా. మా పక్క వీధిలో నారాయణకొట్టులో పకోడీలు బావుంటాయి)

పదకొండు: పెద్ద పెద్ద మీసాలతో మాయింటిదగ్గిర నాగన్న అంత మీసాలతో, చిన్నపిల్లలకి చదువుచెప్పడానికి రాకూడదు. కొందరికి భయంవేస్తుంది. ఇంకొందరికి, పాఠంవిన్నా బుర్రకెక్కదు. ఉత్తినే అలా ఆ మీసాలవేపే చూడాలనిపిస్తుంది. మేష్టరు మాట్లాడినప్పుడు "విష్వక్సేనుడు" (ఈమాట ఎలా రాయడమో బాబాయి నేర్పాడు) లాంటి మాటలు అన్నప్పుడు మీసాలు తమాషాగా కదులుతాయి. అందుకు.

డజను: మేష్టరు రోజూ రాకూడదు. ఓసారి తలనెప్పి అని, ఇంకోసారి జ్వరం అని (కడుపునెప్పి అనకూడదు ఎందుకంటే, అది మేష్టరొచ్చినపుడు పిల్లలికి రావాలి) ఎగగొట్టాలి. అలాచేస్తే పిల్లలు నేస్తంఅవుతారు.

వంద: ఇంకొక్కటి. ఈ ప్రైవేటు కోసం అని స్పెషల్ గా వేరేగదిఇస్తే ఒద్దు అని చెప్పండి నామాట వినకపోతే మీకే నష్టం




ఇంక పిల్లలికి కొంచెం చెప్తాను. ఇకడ్నించి పెద్దవాళ్లు — ముఖ్యంగా ప్రైవేటు మేష్టర్లు అస్సలు చదవకూడదు.

వన్. ఇగో, ఈ మేష్టరున్నారే చూట్టానికి మంచివాళ్లలాఉన్నా, కొంచెం రోలుపోయాకా కొట్టుతారు అలుసుఇస్తే ఇంకా కొట్టుతారు. అందుకని అది ఇవ్వకండి

ఏంలేదు ఒకటే చిట్కా. ముందస్తుగా, ప్రైవేటుకి స్పెషల్ గా ఓ గది కావాలని అలరిపెట్టాలి. అందులో కూర్చున్నాక, ఓ పావుగంట మామూలుగా ఊరుకోవాలి మేషరు వచ్చితే సరే లేకపోతే, ఒక్కసారిగా, "బామ్మోయ్ వీడు గిల్లేస్తున్నాడేవ్" అని గట్టిగా అరవడమే. వాడు నిజంగా గిల్లడనుకో. అయినా గిల్లినట్లు యాడవాలి. మీకు బాగా తెలుసుగా. ఈజీ. కదూ? అలాచేస్తే మా బామ్మ మేష్టరూ పోట్లాడుకుంటారు — తరవాత మేష్టరు మానేస్తాడు. ఇంకో కొత్తవాడు రావడానికి పదిరోజులుకూడా పట్టుతుంది.

టూ: మంచి మేష్టరనుకో, అప్పుడు వాడు ఎలాగా రోజూరాడు. అలాంటి వాళ్లతో పోట్లాటవేసుకోకూడదు. మనకే మంచిది.

టెన్. చిన్నపిల్లలు గుండూ పిలకా పెట్టకోకూడదు నాకు పూర్వకాలంలో రెండూ ఉండేవి. అప్పుడు మాబామ్మ నన్ను చూసి పండులా ఉన్నావు అనేది. కాని గుండు ఉంటే ఎంత నష్టం అని? అందరికీ టెంకిజెల్లకొట్ట బుద్దేస్తుంది, కొట్టుతారుకూడా మేష్టర్లు మొట్టికాయలు కూడా కొట్టుతారు పోలడు నూని ఇంకిపోయేలా. ఇంకొన్ని నష్టాలున్నాయి నాకు చాలా అనుభవంఉంది కనుక చెప్తాను. అనుభవం అంటే టెంకిజెల్లలు, మొట్టికాయలు తినడం.

ఓసారి మాబాబాయి, వాళ్ళ ఫ్రెండు సీత గదిలో కూర్చుని చదువుకుంటున్నారు కబుర్లు చెప్పుకుంటూ అప్పుడు బామ్మేమో వాళ్ళని చూసి, "వాళ్ళ వరసేం బాగులేదు" అని అమ్మతో చెప్పింది అప్పుడేమో నేను,

(ఇంకా ఉంది)




"ప్రైవేటుకని స్పెషల్ గది ఇస్తే వద్దనాలి"

వైటోడెంట్
దంతక్రిములను సంహరించే పండ్లపొడి
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్ లిమిటెడ్. మద్రాసు-30.

RATNAM'S 'N' OIL
సేవించిన పూర్తి సంతోష సౌఖ్యము అనుభవించగలరు 1 సీసా రూ. 11-4-0.
ఎడ్రెస్సుతో జాబు వ్రాయండి
డాక్టర్. రత్నం సన్స్,
మలకపేట బిల్డింగ్స్, హైదరాబాదు-2

# బుడుగు! చిచ్చుల పిడుగు




ఈ పెద్దవాళ్లున్నారే వీళ్ళకి చాలా సంగతులు తెలీవు. అస్సలు ప్రపంచకంలో వాళ్లొక్కళ్లే పెద్దవాళ్లనుకుంటారు. మనం పెద్ద వాళ్ళం అని చెప్పినా వినరు పైగా నవ్వుతారు. అంతేకాదు మన్ని అందరి ముందరా అనుమానం చేస్తారు.

మొన్న నేను బాబాయి వరస గురించి పెద్ద వాళ్లతో మాట్లాడుతున్నానా అంతట్లోకి మా అమ్మవచ్చేసి 'బొబ్బ పోసుకుందుగాని దామ్మా బుడుగూ' అని రెక్క పట్టుకుని బర బరా లాక్కుపోయింది. అది అనుమానం చెయ్యడంకాదూ, నేను ఆశ్చర్య పడిపోయేశాను.

ఎవళ్ళైనా సరే నన్ను కసక అనుమానంచేస్తే నాకు ముందస్తుగా ఆశ్చర్యం వేసేస్తుంది ఆనక, కోపం వచ్చేస్తుంది. మా అమ్మా బామ్మా మరీను. "బుడుగూ బొబ్బ పోసుకుందుగాని లా అమ్మ" అనీ "బువ్వ పెత్తనా బుడుగూ" అనీ అంటారు. నేను ప్రతి సార్లు చెప్పాను. చిన్న వెధవలికీ, చితక వెధవలికీ చెప్పినట్టు అలా బొబ్బా, బువ్వా అని నాతో అనొద్దని.

స్నానానికి లేవరా అనీ, భోం పెట్టుతాను రారా అని పిలవాలని చెప్తానా, వాళ్ళు నవ్వేస్తారు. ఒక్కోసారి ఇంటికి పెద్దాళ్లొచినప్పుడు కూడా నన్ను కుర్రాణ్ణి కింద కట్టేసి అనుమానం చేస్తారు

నా వైస్సు గురించీ అంతే. నాకు ఇప్పుడు ఏళేళ్లా.

ఎవళ్ళైనా అడిగితే మా అమ్మేమో ఆరేళ్లండీ అని అబద్ధం ఆడేస్తుంది. మా బామ్మేమో రెండ్బే. యేదీ నాలుగు వెళ్లింది గాని అయిదోయేడాది యింకా రాందే అని డబాయిస్తుంది.

బాబాయి ఒక్కడే బెస్టు. నాకు కనీసం పన్నెండేళ్లుంటాయని చెప్తాడు లోకులతో.

లోకులంటే కాకులు. ఇలా అని బామ్మ అంటుంది. బాబాయి ఫ్రెండ్లందర్నీ బామ్మ కాకుల్లా ఎండలో తిరుగుతారని కోప్పడుతుంది. అందుకు.

ఇందాకళ చెప్పున్నది అనుమానం చెయ్యడం గురించి కాదూ?

ఏం, మరీ అమ్మ ఆవేళ అలా నన్ను రెక్కట్టుకు తీసుకుపోయిందా. నాకు ఒళ్లు మండిపోయింది. 'ఇన్సల్టు' అన్నాను (ఇన్సల్టు అన్నా కూడా అనుమానం చెయ్యడమేట ఇది ఇంగ్లీషు బాబాయి ఈ మాటని బామ్మ కోప్పడేప్పుడు అంటాడు.)

అమ్మ నవ్వడం మొదలెట్టింది. నాకు బలేకోపం వచ్చేసింది. బొబ్బ పోసుకోను అన్నాను వెక్కిరిస్తూ. అప్పుడు అమ్మకి కోపం వచ్చేసింది. వచ్చేసి ఉత్తి బొబ్బా అల్లా మాశ్చేసి, తలంటి పోసేస్తానుండు అంది. అని నిజంగా తలంటి పోసేసింది. (అప్పుడు నాకు బోడికుండు ఉండేదనుకో)

నేను అప్పటికి ఏడిచినా, ఆ తరవాత, అమ్మ ఇంకోసారి గసురుకున్నప్పుడు అమ్మని కోప్పడేశాను. ఎవళ్లు మాత్రం ఊరుకుంటారు కోప్పడక. మహా మహా చిన్నవాళ్ళే ఊరుకోరు. ఊరుకుంటే ఇంకా లోకువ కట్టేస్తారు. లోకువ కట్టడం అంటే, అర్థం తెలుసుగా. నాకు తెలీదు.

మా అమ్మ ఒక్కొక్కసారి కోపంగా ఉన్నప్పుడు నాన్నని ముందస్తుగా గసురుతుంది. తరవాత, కొంచెం ఏడుస్తుంది. అదన్న మాట.

యేం. ఇందాకా తలంటికిముందు యేదో చెప్తున్నానుగదూ బాబాయి వరస గురించి? నేను పెద్దవాణ్ణి అవుతున్న కొద్దీ గ్నాపకం గబగబ రావటం లేదు.

బాబాయి వరస ఏమిటంటే, అసలు బాబాయి, సీత ఒక వరసగా కూచుని చదువుకోరు. నేనూ మా ప్రైవేటు మేష్టరూ ఎదురుగా కూర్చుంటాం. వీళ్ళు అలాగా కూర్చోరు. అందుకే బామ్మ వాళ్ళ వరస బాగులేదంది. నేనూ అలాగే అనుకున్నా.

అనుకుని బాబాయి గదిలోకివెళ్ళి, మీ వరస బావులేదని నా అభిప్రాయం అని చెప్పేశా.

యేడిశావులేవోయ్ బోడివెధవా బోడి అభిప్రాయం నువ్వూను అనేశాడు బాబాయి అనేసి నా గుండుమీద ఓ టెంకిజెల్ల పుచ్చుకున్నాడు సీత పకపకా నవ్వేసింది.

బాబాయికి అసలు నేనంటే కృతగ్నత లేదు కృతగ్నత అంటే, ఏమిటంటే—

మా బాబాయి ఓ కాలేజీ పిల్లాడనుకో. ఆడపిల్లల కాలేజీ లో చదివే ఓ అమ్మాయి వుంటుందనుకో. (మనకొక్కడు. మా బాబాయికి) అది రెండుజడలు వేసుకుంటుందనుకో. అది మా వీధిలోంచే కాలేజీకి వెళ్ళాలి రోజూ.

మా బాబాయి ఆవేళకే ఎదురుగుండా మొగకాలేజీ వేపు వెళ్తాడు. అప్పుడుచూసి నవ్వుతాడు కళ్ళజోడులోంచి అంటే కళ్ళజోడులోంచి నవ్వడు చూస్తాడన్న మాట. యేంఒక్కసారి వంటఅవలేదనుకో కలకత్తా మెయిలులాగ బాబాయి లేటు అవుతాడు. ఆ జడల పిల్ల మాత్రం తప్పనే వచ్చేస్తుంది. అప్పుడు బాబాయి దాన్ని చూడ్డం ఎలాగ్? వీధరుగుమీద కూర్చుంటే, నాన్న ఏరా ఇక్కడ కూర్చున్నావు అంటాడు అమ్మ కూడా నవ్వుతుంది అప్పుడు బాబాయి సిగ్గుపడతాడు అందుకని, యేమిటంటే, నన్ను వీధరుగుమీద ఉండమంటాడు. ఆ పిల్ల వస్తున్నప్పుడు పరిగెత్తుకువచ్చి చెప్తే తను వచ్చేస్తానన్న మాట






ఇది చాలాకష్టం ఇప్పుడు కొన్ని కార్లున్నాయనుకో అవి ముందర వేపూ వెనకా తలవేపూ ఒక్కలాగే ఉంటాయి. అందుకని దూరంనించిచూస్తే అలాటి కార్లు ఇటు వస్తున్నాయో అటు పోతున్నాయో గబుక్కున తెలీదు

ఈ జడలమ్మాయీ అంతే రెండు జడలు కదూ ఓటి ముందరకీ, ఓటి వెనక్కీ వేసుకుంటుంది. అందుకని వొస్తోందో పోతోందో తెలీదు దూరానికి.

యిలా ఓరోజున నేను కష్టపడిచూస్తూ అరుగుమీద కూచున్నా యింతట్లోకి ఆపిల్ల రైయ్‌మని రైలుబండీలా వచ్చేస్తోంది. నేను లోపలికెళ్ళి బాబాయికి చెప్పి పిల్చుకొచ్చేసరికి ఇలు దాటిపోతుంది కదాఅని, ఆపిల్లనే ముందుపిల్చి కొంచెం అక్కడే ఉండు అని చెప్పి లోపలికెళ్ళా.

బాబాయి రాడే. రోడ్డుమీద నించుందీ, రా బాబాయ్ అని చెప్పినా రాలేదు. పైగా అరవకు బోడి వెధవా అని టెంకిజెల్ల కొట్టాడు.


ఇదే కృతగ్నత లేదంటే అర్థం.

యేం. ఆ వేళా అలా బోడివెధవా అన్నాడా. మొన్ననూ, మీవరస బాగు లేదంటే, బోడి అభిప్రాయం అని మళ్ళీ అన్నాడా.


బాబాయి అలా నాది బోడిఅభిప్రాయం అనడానికి నాకు బోడిగుండు ఉండడమే గదా ఫలితం అనుకున్నాను ఫలితం అంటే కారణం. అంటే నాకు తెలీదు.

ఈ అభిప్రాయం నాదికాదూ బామ్మదిలే అని చెప్పేద్దామనుకున్నాను కాని, ఏం లాభం? నాకు కొంచెం పిలకేనాఉంది. బామ్మకి పిలకకూడా లేదు. అందుకని ఊరుకున్నాను.

అయినా కోపంవచ్చేసింది. ఈ అన్నింటికీ ఈ బోడిగుండూ పిలకాయేకదా ఫలితం అనుకుని, వెంటనే నాన్న కోటుజేబులోంచి ఓ కాణీ తీసుకుని, నా బండీ



# ★ బుడుగు! చిచ్చుల పిడుగు! ★




కొరడా (నిర్భుంకొరడా తెలుసునా?) పట్టుకుని రండ్యమని వెళ్లిపోయాను. ఎక్కడికి ?

మెద్రాసు క్రాపింగుషాపు అని ఓటుంది పక్కవీధి చివర.

మాది ఇదివరకు మెద్రాసేగా. దసరాకి వెళ్లాంలే పదిరోజులున్నాం

అక్కడికెళ్లి, వాడు అర్జెంటుగా మెద్రాసు క్రాపింగుషాపు చెయ్యమన్నాను.

వాడు రండి అని మర్యాద చెయ్యలేదు. పైగా మీ నాన్నని అడిగిరమ్మన్నాడు. ఇలాటివాట్లో నాన్న ఎప్పుడూ అమ్మ పార్టీయే. అందుకనే అడగలేదనుకో.

మా నాన్నంతవాడు వాడూ, నాఅంతవాడు నేనూ. అందుకని ఫరవాలేదూ మెద్రాసు క్రాపింగుషాపు చేసెయ్యి అన్నాడు

వాడు ఓలానవ్వాడు. అలా నవ్వితే నాకు కోపం వస్తుంది. నీకేనాసరే.

అక్కడికీ నా దగ్గిర డబ్బులేదనుకుంటు నాడేమోనని, కాణీ చూపించాను. ఇవ్వలేదనుకో ముందుస్తుగా డబ్బు ఇవ్వకూడదు. పెద్దవాళ్లివ్వరు.

కాణీ చూపించినా వాడు మెద్రాసు క్రాపింగుషాపు చెయ్యనన్నాడు.

యిలాగా నీది గుండుకదా అన్నాడు. అందుకే అర్జెంటుగా చెయ్యాలి అన్నాను నే.

నువ్వు యిక పోతే కొరడాతో కొశేస్తానను వాడు చెయ్యలేదు. అందుకని నవ్వాటి మ్పుకుని పరిగెడుకుని మా యింటికొచ్చేశా.

వాడూ స్పీడుగానే పరిగెడతాడు నా అంత స్పీడు కాడనుకో.

అయినా పట్టేసుకుని కొశేస్తాడని అనుమానం కలిగింది.

అప్పుడు యింకో రోడ్డొంచి గుర్రబ్బళ్ల చోటు కెళ్ళాను.

నాకు తెలీనివాళ్లుంటారేమో చూద్దామని. తెలిసినవాళ్ళ కన్న విశేనయం. తెలిసినవాళ్ళు నేను పిలిస్తే బండీకట్టరు.

అక్కడ ఒక్కడే కొత్తవాడున్నాడు.

మా యింటికి రావోయ్ అని బండి కట్టించేసుకుని రండ్యమని ఇంటికెళ్ళిపోయి, పెరట్లోకెళ్లిపోయి జాంచెట్టెక్కి పోయాను.

తరవాత పెద్దవాళ్ళందరూ ఒకళ్లకొకళ్లు ప్రవేట్లు చెప్పేసుకున్నారు.

చివరకి నాన్నొచ్చి బాబాయికి గట్టిగా ప్రవేటు చెప్పేశాడు.

క్రాపింగు అనికి కోపం పోయేలా డబ్బులిచ్చాను. అంతేకాకుండా బాబాయి వెంటనే ఓసారి క్రాపింగు చేయించుకోవాలన్నాడు బామ్మకూడా అంతేకావాలంది

బాబాయి ఒద్దన్నాడు. పెద్దషాపుకెళ్తే కాని ఫ్యాషన్‌గా చెయ్యరన్నాడు.

పోనీ ఇప్పుడు కొంచెం క్రాపింగు చేయించుకుని ఆనక పెద్దషాపుకి వెళ్లమంది బామ్మ. అప్పుడేమో ఆ పెద్దషాపుకి, ఈ బండీమీద వెళ్లమ్మనన్నాడు నాన్న.

కాని బండివాడు క్రాపింగుఅయ్యేదాకా ఉండనన్నాడు. అంతట్లోకి క్రాపింగుషాపు వాడు అస్సలు నేను క్రాపింగ్ చెయ్యను పొమ్మన్నాడు.


అప్పుడేమో వాళ్లిద్దరూ నేస్తాలయిపోయారు. క్రాపింగుషాపింగువాడు, బండీవాడి గుర్రబ్బండిలో ఎక్కిపోయాడు. ఇద్దరూ ఆ బండిలో వెళ్లిపోయారు.

ఆ వేళ, మా యింట్లో అందరూ కలిసి ఒక్కసారి నాగుండుమీద ప్రవేటు చెప్పేశారన్నమాట. ★

(ఇంకావుంది)



“త్రెండింటా రేటి? ఈ యింటోనే ఎల్లారండి. గుండూ అనీ ఉ. పెద్దోళ్లు బేరం ఆడతారనిసాప్పి బండి కట్టించుకొచ్చా”



# బుడుగు! చిచ్చుల పిడుగు

అందుచేత గుండు ఉండడం సుద్దదండుగ అన్నమాట. దండుగేమిటి డేంజరు కూడాను. ఉట్టిపుణ్యానికి మొట్టికాయలు కొట్టుతారు అందరూ.

అసలు దీనివల్ల అన్నీ డేంజరులే. ఇప్పుడు నాకు బోడిగుండు అనుకోండి. (నిఝంగా ఇప్పుడు లేదనుకో. పూర్వకాలం ఉండేది.) ఉంటే అందరూ టెంకిజెల్లలిచ్చుకుంటారు. అప్పుడు నేనుఘట్టిగా వాళ్లనికొప్పడేస్తాను. ఒక్కోసారి నిఝం కొరడాతో కొట్టేస్తాను. అప్పుడు టెంకిజెల్ల కొట్టినవాళ్లే నను పెంకి వెధవాయి అంటారు. వీటన్నిటికీ ఫలితం గుండుఉండడమేకదా.

ఇంకోటి ఈగుండు మనకి ఉంటేనే డేంజరుకాదు. ఎవళ్లకిఉన్నా డేంజరే. అన్నీ డేంజరులే.

ఇప్పుడు సంబరానికి మానాన్నతో కలిసి వెళ్లామనుకో. అక్కడ గుండుఉండేవాళ్ళు చాలామంది ఉంటారు. మానాన్న మనని ఎత్తుకుంటాడు కదూ. అందుకని మనం ఎంచక్కా దగిరకొచ్చిన ప్రతివాడి గుండుమీద, ఓ మొట్టికాయో, అందకపోతే తేలిగ్గా ఓ జెల్లకాయో కొడతాంగదా. కొట్టాలనికోటం. అలాకోట బుద్దేస్తుంది. నీకేనాసరే

ఓసారి మానాన్న నన్ను సంబరానికి తీసికెళ్ళాడు.

నన్ను ఎత్తుకోవద్దు సుమా. నా అంతవాడిని నేను అని. నాన్నని, ముందుసుగానే బెదిరించాను

బెదిరించడం అంటే ఏమిటంటే——

నాన్నెప్పుడే నాకోడుమీద రెండు జడల పిల్లలాంటిదాన్ని చూసి, బావుంది కదురా బుడుగూ, మెల్లిగా ఈలవెయ్యగలవాఅంటాడనుకో అప్పుడు నేను యీలవేస్తే అపిల్ల హు అని ఇలా మొహం పెట్టి కోపంగా గబగబా వెళ్ళిపోయి, సందు చివర వెనక్కి తిరిగి నవ్వి మళ్లీ వెళ్ళిపోతుందనుకో. అనకేమో నాన్న నన్ను ముద్దుపెట్టుకుని అమ్మతో చెప్పకేం అంటాడు గదా? నాన్నకి నేను ముద్దిస్తే అమ్మకి ఎందుకు చెప్పకూడదూ? అయినా నాన్న వద్దన్నాడుగా. అందుకని నేను చెప్తానంటాను కదూ. అదీ బెదిరించడం అంటే.

## ఎప్పుడూ నిజం చెప్పకూడదు

చెప్తే పళ్ళు రాలగొట్టేస్తా నని నాన్న అంటాడు చూడు? అదికూడా బెదిరించడమే.


ఏం? ఎత్తుకోవద్దని నేను ముందస్తుగానే బెదిరించినా, జనం మట్టైస్తారు వెధవా అని నాన్న నామాట వినకుండా ఎత్తుకున్నాడు. సరే నాకేం అని, నేను దగ్గిరిసావచ్చిన వాళ్ళ నెత్తిమీద మొటికాయలు కొట్టేస్తున్నాను వాళ్లకి ఎవళ్లు కొట్టారో తెలీటం లేదనుకో. కాని, అంతట్లోకీ ఇంకో తళతళ మెరిసిపోయేగుండాయన దగ్గిరికి వచ్చాడు. వాణ్ణి నేను పూర్వం ఎరుగుదును కాని, ఎప్పుడూ తలపాగా పెట్టుకునే కనబడే వాడు నాకు. అందుకని ఆయనకి అలాంటి గుండు ఉందని తెలీదు నాకు. మా నాన్నకీ తెలీదు.

"నాన్నోయ్! చూశావా. వీడిది బోడిగుండు!" అన్నాను ఆశ్చర్యపడి పోతూ.

నాన్న పకపక నవ్వేశాడు. నేను కూడా నవ్వేస్తున్నాను. అంతట్లోకీ ఆయన ఆ ఇరుకులోనే వెనక్కి తిరిగాడు. వాడు చాలా ఎతు నాన్న కన్నాను ... నాన్న నన్ను ఎత్తుకున్నంత ఎత్తు.

"ఏమిటా పొగరు ఎందుకలా నవ్వుతారు?" అన్నాడు వాడు.

"నా యిష్టం నీ గుండు చూసి నవ్వొచ్చింది" అన్నాను నేను.




"ఛప్ నీతో ఎవడు మాట్లాడాడు." అన్నాడు వాడు.

"నేను నీఅంత ఎత్తున్నాను నాతో నే మాట్లాడావు." అన్నాను నేను.

ఇంతట్లోకీ మానాన్న "ఛప్ ఊర్కోరా" అన్నాడు.

అప్పుడు ఎదురుగుండా ఉన్న గుండు వాడికి ఇంకా కోపం వచ్చేసింది.

"నన్ను చూసి నవ్వి, పైగా ఛప్ అంటావా" అన్నాడు.

"నిన్ను కాదు. మా అబ్బాయిని" అన్నాడు నాన్న.

"నన్నే" అన్నాడు వాడు కోపంగా.

వాడు మా నాన్నకి ఫ్రెవేటు చెప్తాస్తాడని నాకు అవమానం వేసింది. అందుకని నిజం చెప్పేశాను.

"యేయ్! అబ్బీ మా నాన్న నిన్ను చూసి నవ్వాడూ, నన్ను ఛీ అన్నాడూ" అని చెప్పేశాను

"ఎందుకు నవ్వాలి? అంటూ" అన్నాడు.

"నేను నవ్వలేదు వాడికి దేపనా" అన్నాడు నాన్న.

"నీకేం పనో నాకేం తెలుసు నువ్వు నవ్వావు అంతే." అన్నాడు వాడు.

"మా నాన్నకి రివిన్యూ బోర్డులో పనీ" అని చెప్పా నేను.

నా మాట యెవళ్ళూ వినలేదు

"నేను నవ్వలేదు" అని అబద్ధం చెప్తాడు నాన్న

"నువ్వు నవ్వావు" అని నిజం చెప్తాడు వాడు.

యెలాగా? అంతట్లోకి నాకు మొటికాయ సంగతి జ్ఞాపకం వచ్చింది ఆ సందట్లో దటుక్కున ఒక్కటి కొట్టాను వాడు అటు తిరిగి ఉన్నప్పుడు ఆ వెనకాతల ఇంకో అబ్బి ఇంకో పిల్లాడ్ని ఎత్తుకున్నాడు. ఆ పిల్లాడు నన్ను చూచి కాపీకొట్టాడు అంటే ఓ మొట్టికాయ కొట్టాడు.

అందరూ నవ్వేశారు. తిరవాత యుద్ధం జరిగింది దీనికంతా ఫలితం, ఆయనకి గుంటు వుండడమే గదా?

అలా అని పెద్ద ప్రాపెంగు ఉన్నా కష్టమే నాకో గుంటుఉంటే ప్రెవేటు మేష్టరు ఒక దెబ్బ కొట్టేసరికి పారిపోవచ్చు. అదే ప్రాపింగు ఉంటేనా, ముందస్తుగా జుటు గట్టిగా పట్టుకుని తిరవాత చాలా సేపు చితక్కొట్టేస్తాడు ఒక్కో సారి ఇలా పైకి ఎత్తి పట్టుకుంటాడు

ఇందాకా చెప్పానే సంబరంలో సంగతి. ఆ వేళ నాన్న, ఇంటికెళ్ళాకా కోప్పడ్డాడు నామీద.

ఎందుకు వాణ్ణి బోడిగుండు అనాలి అసలు? అంటూ.


వాడికి నిజంగా గుంటుఉందిగా అన్నాను నేను.

"ఏడిశావు. బోడినిజం నువ్వూను" అని గసిరాడు నాన్న.

నాన్న ఇలా అనగానే ఎందుకో అమ్మకి నవ్వొచ్చింది.

వాడు చెప్పిన నిజం దాన్ని గురించేగా? అంది.

అప్పుడు నాన్నకి నిజం కోపం వచ్చింది వేళాపాళా ఉండద్దూ నిజం చెప్పడానికి అన్నాడు.



# ★ బుడుగు! చిచ్చుల పిడుగు! ★

ఇగో! నిజం చెప్పేస్తాను విను. నాకు ఇంత అనుభవం ఉందిగాని, ఈ నిజం అనేది ఎప్పుడు చెప్పాలో నిజంగా బాగా తెలీదు.

ఒక్కోసారి మాయింట్లో అమ్మ మినప రొట్టె చేస్తుందా అదివారంనాడు!

సరిగ్గా తినడానికి రెడీ అవుతుండగానే కొందరు మీసాలవాళ్ళు నాన్నతో మాట్లాడడానికి వచ్చేస్తారు. ఎంత సేపటికీ లేచివెళ్ళరు. నాన్న వచ్చేదాకా అమ్మ నాకు రొట్టెని పెట్టదు. ఆ రొట్టే మో చల్లారిపోతోంది. ఎలాగా!

పాపం అమ్మ విసుక్కుంటుందికూడా. పోనీ వాళ్ళకి పెట్టుదామంటే, మేం ముగ్గురం గదా అని కొంచెంగానే చేసింది మరి.

"కబుర్లు చాలు ఇంక ఇళ్ళకి ఫోండి" అని గసుర్తాను అనుకో నామాట ఖాతరు చెయ్యరు.

"మినపరొట్టె చల్లారి పోతోంది, ఈ మీసాలవాళ్లు ఎప్పుడు పోతారో అని నాలోనేనే (వాళ్లకి వినబడేలా) విసుక్కుంటే, వాళ్ళు ఇలా మొహాలు పెడతారు. అనక నాన్న నన్ను పట్టుకుని మొట్టికాయ వేస్తాడు. నిజం అయితే మాత్రం అప్పుడెందుకు చెప్పాలని. మళ్లీ నవ్వుతాడు కూడా.

ఇంకోసారి ఇలాగే అయింది. నాన్న ఊళ్ళోలేదు. నాకు అర్జెంటుగా డబ్బు కావల్సింది. అమ్మని అడిగాను ఇలా అర్జెంటుగా డబ్బుకావాలి అని ఏడిస్తావు లేదుపో ఇంట్లో అసలే ఇబ్బందిగా ఉంది అంది అమ్మ.



— తుప్పజుట్టు వున్నామూడా చిక్కె —

నాకు నాన్నమీద కోపం వచ్చేసింది. అంటే పిన్నిగారూ వాళ్లూను. డబ్బులివ్వకుండా ఊరెళ్ళి అమ్మని ఇలా కష్టపెడతాడాఅని. సరే నాకూ అర్జెంటుగా కావాలిగా పక్కింటి పిన్నిగారి దగ్గర ఓ అర్ధణా అప్పు అడిగాను ఓ కాణీ పెట్టి ఓ బొంగరంకొని, మిగతాడబ్బుతో బియ్యం బస్తా బొగ్గులూ అవీ కొందామని. ఆవిడ నామాట నమ్మదే ముద్దిస్తాగా అంది అర్ధణా

కాని నేను చెప్పింది నిజంకాదుట. అమ్మదగ్గిర డబ్బులు ఉన్నాయట. ఉత్తినే అంది లేదని.

లేదు అంటే ఇవ్వనని అర్థం అన్నమాట అని అప్పుడు తెలిసింది.

ఈ అమ్మమాటలు గబుక్కుని అర్థం అవవు.


అంతెందుకు. అమ్మపేరు రాధ కదా. నాన్న రాధా అంటాడు ఒక్కోసారి పిల్లా అంటాడు. అంటే నవ్వుతుందో. నేను అలా పిలిస్తే చప్ వెధవకానా అంటుంది కోపంగానూ నవ్వుతూనూ.

ఓ సారేం బలేగా అయిందిలే

నాన్నేంచేశాడంటే - అదికాదు. ముందస్తుగా అమ్మ వంటింట్లో వంట చేస్తోంది నాన్న ఏంచేశాడంటే, తలుపు దగ్గిర దాంకుని, అచ్చంగా నాలాంటి గొంతుకతోటే, "పిల్లా వంటయిందా" అన్నాడు అనేసి నవ్వుతూ వంటింట్లోకెళ్లాడు. అమ్మ అటు వేపు తిరిగి ఉందిగా. చూళ్లేదు. నేనే అనుకుంది.

ఆ పళంగా, "వెధవకానా ఏమిటా పొగరు!" అంటూ గిర్రున ఇటుతిరిగింది.

(48-పేజీ చూడండి)



"నాన్నా మినపరొట్టె చల్లారిపోతోంది — ఈ మీసాల వాళ్ళు ఎప్పుడు పోతారో అంటోంది అమ్మ —"

## దీపం వెలిగించక

కసురుకుంటూ ఆడపిల్ల అవడమే మహాపాపం కాబోలననేలాటి మన స్తత్వము కలిగించుతారు. అన్నదమ్ముల అక్కచెల్లెళ్ళ మధ్య అసూయా, ద్వేషాలు, అసహనం కలిగేటంత పక్షపాతబుద్ధి చూపుతారు.

కన్న తలిదండ్రుల ధోరణి ఇది.

ఇక, జీవిత భాగస్వామి అయిన భర్త, జీవితేశ్వరుడులాగే ఆలోచిస్తాడు. "జీవితాంతమూ నాపై ఆధారపడి ఉండవలసిన నీవూ నాకు చెప్పడమేనా" అన్న తరహాలో మాట్లాడుతాడు. తల్లి దైవమని పుస్తకాల్లో చదువుతున్నా, కన్నపిల్లలకి కూడా ఇదంతా చూచాక, అలక్ష్యభావం కలుగుతుంది. "ఎవరూ గౌరవించని ఈమెని మనం అట్టే ఖాతరు చెయ్యకపోయినా ఫరవాలేద"న్న దారిన పడతారు.

ఈ విధంగా స్త్రీకి తన బుద్ధి బలాన్ని, విద్యావిజ్ఞానములను ఉపయోగించుకునే అవకాశం లేకుండా పోతోంది.

కనుక క్రమశిక్షణా లోపాన్ని, వస్తుతః ఓర్పు అనేది తక్కువా స్వార్థము ఎక్కువా అయిన మగవారి చేతిలోనే స్త్రీల మనుగడ ఉండడంవల్లకలిగే అనర్థాలనూ చదువుకి (కళాశాల విద్యకి) అంటకట్టడం ఏమి న్యాయం?

కాకపోతే విద్యావిధానంలో లోపాలు ఉంటే ఉండవచ్చును అవి సవరించుకోడం విజ్ఞఅవుతుంది కానీ, దీపముంటే పురుగులు వస్తాయని దీపంఆర్పేసుకుని కన్ను కానక ఏ తేలో, పామునో తొక్కి అది కరుచుట వల్ల బాధపడంలాగా, యువతులకు కళాశాల విద్య అనర్థదాయక మనడం అవివేకమే అవుతుంది. ★

## తోటికోడళ్ల బాధ్యత

(44 వ పేజీ తరువాయి)

ఇంటికొస్తే మా అమ్మ బాధపడేది. ఉన్న నాలుగు రోజులయినా ఏమయినా చేసిపెట్టాలని ఆమెబాధ. కాని ఆయమ్మ అజ్ఞలేనిదీ, దేనికీఅశక్తురాలు. నేనేసమాధానపరిచేదాన్ని అమ్మని. పట్నం నుండి వస్తూ కనీసం మాట వరసకైనా పిల్లలకి ఏమీ తెచ్చేదాన్ని కాదు. ఓసారి తెస్తే, "అంత డబ్బు ఖర్చు చేసి ఎందుకు తేవాలి?" ఇక్కడవాళేమీ తినడం లేదా అని ముఖం చిటించింది. పిల్లవాళ్లు ఏమయినా తెచ్చిందేమో అన్న ముఖాలు పెట్టేవారు. వాళ్ళముఖాలు చూస్తే నా హృదయం తరుక్కుపోయేది.

చివరికి పెదనాన్నగారు మాతమ్ముణ్ణి 'వత్తుం' తీసుకొనేప్పటికి తలప్రాణం తోకకి వచ్చింది. అంతవరకూ పిల్లలూ జెల్లలూ నాకేం అవసరం లేదనేది ఆమె. తన కడుపున పుట్టితేగాని తన బిడ్డ అనుకోలేదు ఆమె ఎలా అయితేనేం పెదనాన్న ప్రోద్బలం వల ఒప్పుకొంది. వాడింకా 'ఫోర్త్ స్టాండర్డ్' చదువుతున్నాడు. ఆయమ్మ అంటుంది, వాణ్ణి పట్నం పంపించాలని. సమీపాన ఉన్న 'టౌన్'కి పంపిస్తే ఖర్చులుండవని నాయనగారంటారు.

రోజూభోజనాల వద్ద ఆమధ్య ఇదే సమస్య. 'పట్నంలో చదివితే తెలితేటలు వస్తాయి. ఏం, వాణ్ణెందుకు అక్కడే చదివించగూడదు?' అంటుందామె 'టౌన్'లో అయితే తెలిసినటిచర్లు కనుక ఓ వేళ ఫెయిలయినా ప్యాస్ చేయించవచ్చు పట్నంలో మనకు తెలిసిన వాళ్ళుండరు అని నాన్న ఎంతఅన్నా నాతో వాణ్ణి కూడాపంపించింది; ఫస్ట్‌ఫారం చదవడానికి. నాకెందుకు వందరూపాయలు నెల నెలా పంపిస్తున్నారా అని ఆమె ఈర్ష్య!

ఇక అమ్మతరఫున బంధువు లెవరయినా ఇంటికివస్తే ఆనాడల్లా చురచురలాడేది. అందుకని ఎవరూ రావడానికి జంకేవారు.

ఒకనాడు ఆయిల్లు రెండుముక్కలయింది. పెదనాన్నగారెంతోగానో బాధపడ్డారు. అదివరకు అంతపచ్చగా ఉన్న మేము వాడిపోయాం. మాఇంట్లో గంపెడుపిల్లలు. సంరక్షణ భారం పెద్దది. పెళ్ళికాని ఆడపిల్లలం ... నా చదువు మానేయవలసి వచ్చింది. ఒకసారి పెదనాయనగారన్నారు 'నేను మీ ఆయమ్మకి తెలీకుండా రూపాయలు పంపుతానమ్మా, నీవు చదువుతల్లీ!' అని. మరోజన్మలో ఆయన కడుపులో పుట్టాలని దేవుణ్ణి ప్రార్థించాను.

బామ్మ నేను పట్నంనుండి రాగానే నన్ను కూచోబెట్టి అన్నీ వివరంగా చెబుతుంద ఇవన్నీ వింటూంటే నాకు బాధ కలిగేది. అంచేత అసలు ఇంటికి ఒక్కొక్కతడవ సెలవులున్నా వెళ్ళ బుద్ధిపెయదు.

అయినా, అవిభక్త కుటుంబాలు కలిమిడిగా మసులుకోకపోతే ఆ సంసారాలు ఎవరికీ పట్టనివిగా నానాటికి తీసికట్టయి క్షీణిస్తాయి. అటువంటప్పుడు విడిపోవడమే మంచిది

ఒక్క కడుపునుండి ఒకేరక్తం పంచుకొని పుట్టిన వారికి సైతం ఈ కుటుంబ విచ్ఛిత్తి మూలంగా పెద్దపెద్దఅంతరాలుఏర్పడతాయి. చూస్తూండగానే మేడ ప్రక్కన గుడిసె ఏర్పడవచ్చు.

ఒక కుటుంబ విచ్ఛిత్తికి ఒక స్త్రీయే హేతువై ఉండడంమనవాళ్ళదురదృష్టం ★

## అదీ కారణం!

యువజనసంఘం ఒకటి వరకట్న నిషేధం గురించి ప్రచారం చేయ పూనుకొంది. అరఫర్లాంగు పొడుగున్న కాగితంమీద వరశుల్కం కూడదని వ్రాసి ఊళ్లో వాళ్ల సంతకాలు పోగుచేసుకొచ్చారు సభ్యులు. ఎటొచ్చి సంఘం కార్యదర్శి తండ్రి సంతకం కనబడలేదు.

"అదేమిటోయ్, ఘనుడా 'మీ' నాన్న సంతకమే లేకపోతే ఎలా. వెళ్ళి పెట్టించుకురా" అన్నాడు ఒక సభ్యుడు

"ఏడిశారు. నే నెలా అడుగుతాను; అడిగినా ఆయనెలా పెడతాడు. మాకు అసలు అక్కచెల్లెళ్లు లేరుగా. ఇంట్లో అంతా మొగసజ్జే" అన్నాడు కార్యదర్శి

'వాణి'

## బుడుగు చిచ్చుల పిడుగు!

[22 వ పేజి తరువాయి]

తిరిగితే ఇంకేముంది. అక్కడ నేనులేను. నాన్న ఉన్నాడు. అయితే, ఇందాక నాన్న నవ్వుతున్నాడు ఇపుడు హాశ్చర్య పోయేస్తున్నాడు.

అప్పుడు అమ్మకి కోపం వచ్చేసింది. "బాపుంది మంచీచెడ్డా లేకుండా ఏమిటా సరసాలు" అంది, సరసాలంటే నాకు తెలీదు.

నాన్న నవ్వేసి, అమ్మపక్కనే కూచొని, నువ్వు పిల్లవి కావా అన్నాడు. అయినా అమ్మ నవ్వలేదు.

ఛ నోట ఎలాటిమాటలొచ్చాయమ్మా. అంది మెల్లిగా అంతట్లోకి అమ్మకళ్లలోంచి మెలిగా. కన్నీళ్ళు వచ్చాయి

"అమ్మ ఏడుస్తోంది. మా అమ్మని నువ్వెందుకు కొప్పడ్డావు" అని నాన్నని కోప్పడ్డాను నేను


"అట్టే అమ్మ ఏడవటంలేదు. ఉల్లిపాయలు తరుగుతోందికదూ. అందుకూ కన్నీళ్లు" అన్నాడు నాన్న అమ్మకి కళ్లు తుడుస్తూ.

కాని అక్కడఅప్పలుఉల్లిపాయలులేవు!

"అక్కడ ఉల్లిపాయల్లేవు," అన్నాను నేను.

నాన్నకి కోపంవచ్చింది. నేను నిజం చెప్పివానసరే. హూం అన్నాడు కోపంగా.


అందుకే నిజం ఎప్పుడు చెప్పాలో నాకు నిజంగా తెలీదన్నాను. నన్నడిగితే నిజం ఎప్పుడూ చెప్పకూడదు. (ఇంకా ఉంది)





ఎప్పుడూ అంటే అసలు ఎప్పుడూ నిజం చెప్పకూడదని కాదు. అస్తమానం ఎప్పుడూ అని అర్థం అన్నమాట.

ఇప్పుడు. నేనున్నానా. బాబాయి ఉన్నాడా... బాబాయీ నేనూ ఎప్పుడేనా అలా షైరు వెళ్తామా. అక్కడ ఇంకొందరు అప్పలు కుర్రాళ్లు ఉంటారా. అప్పుడు, రెండుజడల అమ్మాయో, ఒక్క జెడల అమ్మాయో రోడ్డు మీంచి నడిచి వెళ్ళిపోతోందిగదా

అప్పుడు ఈ బాబాయీ, వాడి ఫ్రెండ్లూ ఈల వెయ్యాలిగదా. వాళ్లకి పాపం రాదుగదా. అప్పుడు నన్ను ఈలవేసి పెట్టమంటారు.









నేను ఖయ్‌మని ఈల వేస్తా. నాకు బాగా వచ్చు. రౌడీల దగ్గర నేర్చుకున్నానులే. రౌడీలు బీడీలు కాలుస్తారు. నేను కాల్చననుకో. అయినా నా దగ్గిర కొన్ని వున్నాయి. జటకా బండి తోలినప్పుడు చెవిలో పెట్టుకోవాలిగా అందుకు.

బీడీలు ఇంకొందుకు కూడా మంచివి. అమ్మ లేనపుడు బామ్మ దగ్గిరికి వెళ్ళి మీద పడేస్తానంటే, కాణీ ఇచ్చేస్తుంది. అందుకు.

యేం. అప్పుడు నేను యీలవేస్తే బాబాయి వాడి ఫ్రెండ్లూ కలిసి, ఓ కాణీయో పదణాలో ఇచ్చేస్తారు నాకు. ఇపుడు నేను ఆ కాణీయో పదణాలో పట్టుకుని ఇంటికి వస్తానా. అమ్మ నా జేబులు తనిఖీ ఎక్కడిదిరా బుడుగూ కాణీయో పదణాలో అంటుంది. తనిఖీ అంటే జేబులు వెతికి కాణీలు లాక్కోడం. అపుడు నేను ఆ కాణీ ఎక్కడిదో చెప్పానను కో కోకోశేస్తుంది, ఇంకెప్పుడూ అలాటి పని చెయ్యకేం జులాయి వెధవా అంటుంది. అందుకని ఇంకోసారి నిజం చెప్పకూడదు. ఎప్పుడేనా సరే ఓసారి ముట్టికాయ తింటే, రెండోసారి నిజం చెప్పకూడదు.

అయినా యీ పెద్దాళ్లకి అన్నీ గొడవలూ కావాలి. నేను మొగాడ్నిగదా. వీధిలోకివెళ్ళి కాణీ సంపాదించుకువస్తే ఎక్కడిదీ అని ఎందుకు అడగడం. ఎందుకు మన





> "పనీపాటూ లేకుండా రోడ్డు వెంట తిరిగే సోమరులకు నేను దమ్మిడీ కూడా ఇవ్వను."
> "బావుంది. తిరగడం కూడా మానేసి ఆఫీసు పెట్టుక్కూర్చుంటే పట్టుకొచ్చి ఇస్తారా?"

# ★ బుడుగు! చిచ్చుల పిడుగు! ★

సీత అనవసరంగా నిజం చెప్పడం! మళ్ళీ కొట్టడంను? అందుకే నాకు కోపం. అన్ని గొడవలూ వీళ్ల కెందుకని.

ఆఖరికి బాబాయి సీతకిలా లెట్రు రాసినా వీళ్లకేకావాలి. లౌలెట్రు అంటే నాకు తెలీదు ఇవి బాబాయి దగ్గిర ఉంటాయి. బోల్డు ఉంటాయి. రాని మళ్ళీ చింపేస్తాడు. మళ్లీ రాస్తాడు.

యేం. ఓసారి బాబాయి ఈ లెట్రు (చూట్టానికి అచ్చు ఉత్తరంలా ఉంటుందిలే) నా చేతికిచ్చి, సీత చేతికిచ్చి రమ్మన్నాడు. నేను వెళ్లేసరికి సావిట్లో సీత నాన్న కూర్చున్నాడు. వాడికెందుకు చెప్పు అన్ని గొడవలూను.

ఎవరికిరా ఆ ఉత్తరం అన్నాడు.

ఎవరికో నీ కెందుకురా అన్నాను నేను.

భడవా ఇలారా అనేసి వాడు నన్ను గభుకుని పట్టేసుక్కున్నాడు. చేతులో ఉత్తరం లాక్కు చూశాడు. చూసి హుఁ అన్నాడు.

హేం పొగరు. రాస్కెల్. నా కూతురికి ఉత్తరం రాస్తాడా? చెప్తా ఉండు. అన్నాడు వాడు.

లేకపోతే నీకు రాస్తాడా అన్నాను నేను.

అసలు బాబాయి ముందరే చెప్పాడు వాళ్లి నాన్నకి దచ్చినా ఇవ్వద్దని మరి వీడు లాక్కున్నాడు గదా. ఎలా? వీడు, మా నాన్న అందరూ కలిసి బాబాయికి ప్రవేటు చెప్పేస్తారని నాకు అవమానం వేసింది జాలి కూడా వేసింది. వీళ్లమీద కాదు. బాబాయి మీద.

వేశాక, అప్పుడు ఒకలా అనుకున్నా. బాబాయిని రక్షించాలని.


నేను ఇలా అందర్నీ బోల్డుసార్లు రక్షిస్తాను. రక్షించడం అంటే కాపాడ్డం. అంటే నాకు తెలీదు.

యేం. సీత నాన్న ఆ ఉత్తరం పట్టుకుని ధాం ధూం అంటున్నాడు కదూ. అది లాక్కు పారిపోవా లనుకున్నా. కాని అందదే. వాడు చాలా ఎత్తుగదా.

ఓసారి వన్నెత్తుకోవూ అని అడిగాను.

భవ్ నోర్ముయ్యి. నిన్నూ మీ బాబాయినీ కూడా చితకొట్టేస్తాను అన్నాడు. అప్పుడు నేను కొంచెం దూరముగా నిల్చున్నాను.

బాబాయిని రక్షించడం ఇంకెలా.....




అప్పుడు ఇంకో ఉపాయం వచ్చింది. ఉపాయం అంటే అబద్ధం.

“ఉరేయ్ సీత నాన్నా! మరేం, ఆ ఉత్తరం బాబాయి కాదూ. నేనే రాశా ఓచ్చీ అనేసి పరిగెరు కెళ్ళిపోయా.

అయినా లాభం లేదనుకో. వాడు మా యింటి కొచ్చేశాడు. అప్పుడు బాబాయి వంటింట్లో దాంకున్నాడు. నాన్నా వాళ్లూ సీత నాన్నతో మాట్లాడారు. తరవాత సీతకీ బాబాయికీ పెళ్ళి చేసేద్దాం అన్నారు. చివరికి నన్ను కొట్టారనుకో.

నేను ఇంకోసారి ఇలాగే నాన్నని రక్షించాను. నాన్న ఆవేళ అద్దం కిందపడేసి బద్దల కొట్టేశాడు. అమ్మ చూస్తే కోప్పడేస్తుందని భయపడుతున్నాడు.

అప్పుడు నేను అమ్మదగ్గిరికెళ్ళి అదం నేనే బద్దలుకొట్టానని అబద్ధం చెప్పేశాను. యిలాగా నన్ను అల్లరివెధవా అంటూగదా ఇది కూడా నేనే చేశానంటే నష్టం యేమిటి.

అప్పుడు నాన్నేమో, అమ్మ చూడకుండా నన్ను ముద్దుపెట్టుకుని అర్ధణా కాణీ ఇచ్చేశాడు. మాకావాఅబద్ధం చెప్తే ఎంతలాభమో.

అమ్మకూడా నవ్వేసి ముద్దు పెట్టుకుంది. మళ్ళీ పెంకీభడవా అంది.

యెంగుకో మరి నేను మేలుకుని ఉన్నపుడు ఇలాగే తిట్టారు అందరూ నిద్రపోతున్నపుడు నేను యెంతో ముద్దొస్తానటమళీ యెంచాతో!

